క్లుప్తంగా

ఏపీ సీఎం కప్ హ్యాండ్ బాల్ పోటీలకు ఏఎన్ఎం ఎంపిక


రేణుకాదేవి

బేతంచెర్ల: రాష్ట్ర స్థాయిలో జరిగే ఏపీ సీఎం కప్ హ్యాండ్ బాల్ పోటీలకు పట్టణంలోని 4వ సచివాలయం ఏఎన్ఎం రేణుకాదేవి ఎంపికయ్యారు. ఈసందర్భంగా నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు హర్షం వ్యక్తం చేస్తూ ఏఎన్ఎంను అభినందించారు. రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని తోటి సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు ఆకాంక్షించారు.

దేవదాయ భూములను కాపాడాలి

డోన్‌టౌన్: నియోజకవర్గంలోని దేవదాయశాఖ భూములను భూకబ్జాదారుల నుంచి రక్షించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధక్షుడు కొత్త కాపు హేమసుందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆర్డీఓ వెంకటరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 910, 561, 102, 394 సర్వే నంబర్లు, ప్యాపిలి మండలంలో 81, 896, 63, మాధవరం గ్రామంలో 366, 367, బూరుగల తదితర గ్రామాల్లోని దేవదాయ శాఖ భూములను పలువురు ఆక్రమయిస్తున్నారని, అధికారులు స్పందించి కాపాడలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డే మహారాజ్‌తో పాటు మరికొంత మంది ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి


మజ్జిగ పంపిణీ చేస్తున్న కమిషనర్ రమేష్ బాబు

బేతంచెర్ల: సమాజంలోని ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు సూచించారు. సోమవారం స్టేట్ బ్యాంక్ సమీపంలో వడ్డెర సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని కమిషనర్ పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వడ్డెర సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, సంఘం నాయకులు మక్కెల సుబ్బరాయుడు, లాలప్ప, దేరంగుల రాజు, తిరుపాలు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని బేగరిపేటకు చెందిన యువకుడు భరత్ ఊపిరితిత్తుల వ్యాధిలో బాధపడుతూ వైద్యం చేయించుకున్నాడు. అతనికి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1.20 లక్షలు మంజూరైంది. చెక్కును సోమవారం ఎంపీపీ బుగ్గన నాగభూషనం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగ స్వామి, వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, ఎంపీటీసీ నాగేషు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా శ్మశానవాటికలో అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులు జరుగుతున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని నేల మఠం సమీపంలో ఉన్న ఆర్యవైశ్య బ్రహ్మణ శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. శ్మశానవాటికలో కనీసవసతులు లేవని ఆర్యవైశ్య సోదరులు స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి రూ.8 లక్షలను మంజూరు చేయించారు. దీంతో శ్మశానవాటికలో బోరు, ప్రహరి, స్నానపు గదుల నిర్మాలు జరుగుతున్నాయి. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తానమని మండల ఏఈ వెంకటరమణ తెలిపారు.

విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ప్రారంభం

ప్యాపిలి: మామిళ్లపల్లె గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. సోమవారం స్వస్తిపుణ్యాహవచనం, గణపతి పూజ, నవగ్రహ మండప పూజ, కంకణధారణ, రుత్వికరణం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం మూలమంత్ర జపాలు, హోమాలు, దివ్యాధివాసం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.


గుళ్లదూర్తి సమీపంలో దిగుబడులు తడవకుండా పట్టలు కప్పి ఉంచిన దృశ్యం


బేతంచెర్లలో వర్షం కురుస్తున్న దృశ్యం


డోన్ కూరగాయల మార్కెట్ వద్ద కూలిన రేకుల షెడ్డు

వర్ష బీభత్సం

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం
- కొలిమిగుండ్ల మండలంలో 54.2 మి.మీ వర్షపాతం నమోదు
- వరి రైతుకు నష్టం

కోవెలకుంట్ల: వేసవికాలం ఇటీవల కాలంలో కురుస్తున్న అకాల వర్షాలు అన్నదాతను వెంటాడుతున్నాయి. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సబ్ డివిజన్‌లోని కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 54.2 మి.మీ, అవుకు మండలంలో 48.6, కోవెలకుంట్ల 32, ఉయ్యాలవాడ 29.4, దొర్నిపాడు 26.8, సంజామల మండలంలో 13.4 మి.మీ చొప్పున వర్షపతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు తెలిపారు. అకాలవర్షంతో సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల వరి, మిరప రైతులకు నష్టం వాటిల్లింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి కోత, నూర్పిడి దశలో ఉండగా వర్షంతో వరి నేలవాలింది. మిరపలో చివరి కోత దిగుబడులు తడిచిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. భారీ వర్షంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో అర్ధరాత్రి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

కొలిమిగుండ్ల: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండల వ్యాప్తంగా సోమవారం తెల్లవారు జామున ఉరుములు,మెరుపులు తోడవడంతో కుండ పోత వర్షం కురిసింది. రెవిన్యూ అధికారుల లెక్కల ప్రకారం 54.2 మి.మీ వర్షపాతం నమోదైంది. నాయినపల్లె సమీపంలోని కదిరికుంటకు వర్షపునీరు చేరడంతో అలుగు పారింది. నాయినపల్లె, పెట్నికోట గ్రామాల సమీపంలోని వాగులు మోస్తారుగా ప్రవహించాయి. పలు గ్రామాల్లోని పొలాల్లో వర్షపునీరు నిల్వ చేరాయి. వర్షం ధాటికి వీధులు జలమయం అయ్యాయి. అబ్దులాపురం, కోర్నపల్లె తదితర గ్రామాల్లో వరి, జొన్న పంటలు గాలులు,వర్షం ప్రభావంతో కొంత మేర నేలకొరిగాయి. మొక్కజొన్న, మిరప పంటలు కలాల్లో నిల్వ ఉండటంతో తడిసిపోకుండా కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చింది. ఉరుముల శబ్దాలకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.


అబ్దుల్లాపురంలో నేలకొరిగిన వరి పంట


మృతి చెందిన బర్రెలను పరిశీలిస్తున్న వెటర్నరీ ఏడీ, వైద్యురాలు

బేతంచెర్ల మండలంలో భారీ వర్షం

బేతంచెర్ల: మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శంకరాపురం గ్రామంలో తెల్లవారు జామున గ్రామానికి చెందిన రైతు పురుషోత్తం రెడ్డి బర్రెలపై పిడుగు పడటంతో రెండు బర్రెలు మరణించాయి. సుమారు రూ.1.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. సమాచారం తెలుసుకున్న వెటర్నరీ ఏడీ వసంతలక్ష్మి, వైద్యురాలు శంశద్ బేగం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు. అలాగే ముద్దవరం గ్రామ పరిధిలో అంబాపురం వెంకటలక్ష్మి, ఆదిలక్షమ్మ, మధులకు చెందిన 6.89 ఎకరాల అరటి పంట దెబ్బతినింది. సుమారు 10.50 లక్షల మేర ఆస్థి నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగమణి అరటి తోటలను పరిశీలించి, నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

డోన్:మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల రహదారులు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు జలమయమయ్యాయి. డోన్ కూరగాయల మార్కెట్ ప్రహరీ రేకులు గాలికి కొట్టుకపోయాయి. గోసానిపల్లె, చింతలపేట, ఓబులాపురం గ్రామాల్లో ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి. ఆదివారం 37.2 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అవుకు: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మండలంలో 310 హెక్టార్లలో వరి, 80 హెక్టార్లలో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశామని వ్యవసాయఅధికారి ప్రసాద్ రావు చెప్పారు.

ఘనంగా పాండురంగడి తిరుణాల


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం పేట తిరుణాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, నూతన వస్త్ర అలంకరణ, విష్ణు సహస్రనామస్తోత్ర పారాయణం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం కోనేటి పుష్కరతీర్థంతో స్వామివారికి పుష్కరపూజ చేశారు. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కోనేటి తిరుణాల కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

కనులపండువగా వాసవీ మాత గ్రామోత్సవం


వాసవీ మాత ఉత్సవ విగ్రహంతో ఆర్యవైశ్యులు

బేతంచెర్ల: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీమాత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని స్థానిక అమ్మవారి శాల నుంచి రథంపై గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కడపకు చెందిన కళాకారుల శివ పార్వతులు, కాలికా మాత వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్: చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఇక నుంచి కార్డుదారులకు కేజీ బియ్యానికి బదులు కేజీ జొన్నలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, తహసీల్దార్ విద్యాసాగర్, మునిసిపల్ వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టుపసాద్, కౌన్సిలర్లు కళావతి, మల్లికార్జునరెడ్డి, నాగేంద్ర, ఆర్ఐ రమణ పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో తెల్లకార్డుదారులకు కిలో బియ్యం బదులు కిలో జొన్నలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మహేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య ప్రయోజనాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని తహసీల్దార్ పుష్పకుమారి అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సోమవారం లబ్ధిదారులకు కిలో బియ్యానికి బదులు కిలో జొన్నలు అందజేశారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్ఓలు చెన్నయ్య, షఫియా, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


రేషన్‌కార్డుదారులకు జొన్నలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్యాపిలి: బియ్యం కార్డుదారులకు కేజీ బియ్యానికి బదులు కేజీ జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి ప్రారంభించారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: అదనపు కట్నం కోసం భర్త, మామ, ఆడపడుచు వేధింపులకు గురిచేస్తున్నారని మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన మౌనిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన మౌనికను నంద్యాల పట్టణానికి చెందిన రెడ్డి పోగు సందీప్‌బాబుకు ఇచ్చి ఏడాది క్రితం వివాహం చేశారు. కట్నకానుకలుగా రూ.6 లక్షల నగదు, 6 తులాల బంగారు ఇచ్చారు. కాగా కొంత కాలంగా అదనపు కట్నం రూ. 5 లక్షలు ఇవ్వాలని తనను భర్త సందీప్‌బాబు, మామ రామసుబ్బయ్య, ఆడపడుచు యోగేశ్వరి వేధిస్తున్నారని మౌనిక పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ వెల్లడించారు.

హుండీ కానుకల లెక్కింపు



కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గా హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. ఏడాదికాలంలో దర్గాకు వచ్చే భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించగా రూ.14.95 లక్షలు సమకూరిందని, ఈ మొత్తాన్ని దర్గా అభివృద్ధికి వెచ్చిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పదవీ విరమణ ఉద్యోగికి ఘనంగా విడ్కోలు


అధ్యాపకుడిని సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ సోమవారం స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసిన ఎస్ఎల్‌సీ ఖన్నాను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించి విడ్కోలు పలికారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, న్యాయవాది నాగభూషణం రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ భారతిలు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులు మార్గదర్శకులుగా వారి అనుభవాన్ని పంచాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు నూకరాజు పాల్గొన్నారు.

ఆస్థి వివాదంపై కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని జెండాపేట కాలనీకి చెందిన వదిన, మరదలు ఇంటి ఆస్థి విషయంలో గొడవ పడిన ఘటనలో పోలీసు కేసు నమోదు చేశారు. సీఐ ప్రియతం రెడ్డి తెలిపిన వివరాలు.. జెండాపేట కాలనీకి చెందిన హుసేన్ పీరా భార్య షేక్ షంషాద్‌బీతో ఇంటి ఆస్థి విషయంలలో ఆడపడుచు షేక్ అబ్దుల్ రహిమాన్ భార్య షేక్ మహబున్నీ గొడవపడి దాడి చేసుకున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా మేడే వేడుకలు

డోన్, బనగానపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా మేడే వేడుకలను కార్మికులు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కమ్యూనిస్ట్ పార్టీలు, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని కార్మిక జెండా ఎగుర వేసి మాట్లాడారు. కేంద్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు సూచించారు.

బేతంచెర్ల: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయ ఆవరణంలో జరిగిన మేడే వేడుకలకు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఆర్ఎస్ రంగాపురంలోనూ కార్మికులు మేడేను జరుపుకున్నారు. సిమెంట్ నగర్ గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు సూర్య చంద్రుడు ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలోసీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, మండల సహాయ కార్యదర్శి భార్గవ్ పాల్గొన్నారు.

డోన్ టౌన్: మేడే ఉత్సవాల్లో భాగంగా కార్మికులు పట్టణంలో ఎర్ర జెండాలతో ర్యాలీ నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఆర్టీసీ, విద్యుత్‌శాఖ, యూటీఎఫ్, ఎస్టీయూ, ఆటో యూనియన్, హమాలీ యూనియన్, లారీ కార్మికులు, బిల్డింగ్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలో పలు సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. జమ్మలమడుగు చౌరస్తాలో జరిగిన మేడే వేడుకల్లో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ యూనియన్ల నాయకులు రెడ్డిపల్లె ఓబయ్య, వెంకటసుబ్బయ్య, కంబగిరిరాముడు, నారాయణ, చక్రవర్తి పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: స్థానిక సివిల్ సప్లయి గిడ్డంగి ఆవరణంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో ఎంజీఎంఎం లేబర్ అండ్ హమాలీ యూనియన్ అధ్యక్షులు బీవీ సుబ్బారెడ్డి, పెట్రోల్‌బంకు జీఎంటాకీస్ సమీపంలో సీపీఐ జిల్లా ఉపాధ్యక్షులు శివయ్య, మండల కార్యదర్శి సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రామాంజనేయులు పాల్గొన్నారు.


బేతంచెర్లలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్


ఉత్సవాలకు హాజరైన కార్మికులు

ప్యాపిలి: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుని కలచట్ల రోడ్డు, బస్టాండ్ వద్ద కార్మిక జెండాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్ ఆవిష్కరించారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలోనూ మేడే వేడుకలు జరిగాయి.

క్రీడలతో మానసికోల్లాసం


షటిల్ క్రీడాకారులతో ఎంపీపీ, మునిసిపల్ చైర్మన్

డోన్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన షటిల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, ప్రభుత్వ వైద్యులు బాలచంద్రారెడ్డి, కౌన్సిలర్లు నాగేంద్ర, మల్లికార్జునరెడ్డి, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టుపసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్ అండ్‌బీ రహదారిలో సోమవారం నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బనగానపల్లె మండలం రామతీర్థంకు చెందిన నాయకుడు, రామచంద్రుడు బైక్‌పై జమ్మలమడుగువైపు నుంచి వస్తుండగా ఉయ్యాలవాడ మండలం ఎస్.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఉసేన్‌బాషా, మాబు కోవెలకుంట్ల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేపు చంద్రపల్లె - పీఆర్ పల్లె రోడ్డు ప్రారంభం

డోన్: ప్యాపిలి మండలం చంద్రపల్లె గ్రామం నుంచి పీఆర్ పల్లె గ్రామం వరకు రూ.11కోట్లతో నిర్మించిన నూతన రహదారిని ఈ నెల 3న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటలకు చంద్రపల్లె గ్రామానికి చేరుకొని అక్కడి నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న పీఆర్ పల్లె వరకు మంత్రి రోడ్డు వెంట పాదయాత్ర చేస్తారని, ప్యాపిలి మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరింది.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: స్థానిక జమ్మలమడుగు చౌరస్తాలో సోమవారం ఎస్ఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వివిధ ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్ లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

పింఛన్ల పంపిణీలో డోన్ ముందంజ

డోన్: ఎప్పటిలాగానే ప్రభుత్వ పెన్షన్‌ల పంపిణీలో జిల్లాలో డోన్ అర్బన్ ముందు వరుసలో నిలిచింది. వేకువజాము నుంచే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల ఇళ్లవద్దకు వెళ్లి పెన్షన్ మొత్తాన్ని అందజేశారు. 5,428 మందికి గానూ 4,610 మంది లబ్ధిదారులకు మొదటి రోజే పంపిణీ చేసి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచామని అధికారులు తెలిపారు.

కొలిమిగుండ్ల: మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, చేనేత, డప్పు, చర్మకళాకారులు తదితర పింఛన్‌లు 7001 ఉన్నాయి. మొదటి రోజు 75 శాతం మేర పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

అవుకు: మండలంలో వివిధ రకాల పింఛన్లు 6,627 ఉన్నాయి. మొదటి రోజు సాయంత్రం నాలుగు గంటల సమయానికి 5,075 మందికి పింఛన్ సొమ్ము అందజేసినట్లు ఎంపీడీఓ అజాంఖాన్ తెలిపారు. దాదాపు 76.58 శాతం పంపిణీ పూర్తయ్యిందని, ఒకటి, రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేస్తానమి ఆయన తెలిపారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో సోమవారం తెల్లారక ముందే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. కోవెలకుంట్ల మండలంలో 5,861 మంది పెన్షనర్లకు గానూ 4,960 మందికి(85 శాతం) అందజేసినట్లు సాధించినట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా తెలిపారు. సంజామల మండలంలో 5,145 మందికి గానూ 80 శాతం మందికి అందజేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన వితంతువు ఈశ్వరమ్మ అనారోగ్యంతో నంద్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ మహబూబ్‌జానీ అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు.


నంద్యాల ఆసుపత్రిలో ఈశ్వరమ్మకు పింఛన్ అందజేస్తున్న కానాల వలంటీర్ మహబూబ్ జానీ

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

బనగానపల్లె రూరల్: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని టంగుటూరు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాలు.. 40 ఏళ్ల వయసున్న మతిస్థిమితం లేని వ్యక్తి కొంతకాలంగా ఉదయం పొలాల్లో దిగంబరంగా సంచరిస్తూ రాత్రి గ్రామంలోని పెద్దమ్మ గుడి సమీపంలో నిద్రిస్తూ జీవనం గడిపేవాడు. ఎండతీవ్రత లేదా అనారోగ్యంతోనైనా మృతి చెంది ఉంటాడనే అనుమానం పోలీసులు వ్యక్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సర్పంచ్ నాగమద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రిపై తనయుడి దాడి

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం పేరుసోముల గ్రామంలో సోమవారం తండ్రిపై తనయుడు దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఏఎస్ఐ నాగరాజు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన బిరుసంటి జయన్నకు ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడైన చిన్నబాబు పొలంలో తండ్రి బోరు వేయించాడన్న నెపంతో పెద్ద కుమారుడు ఓబులేసు తండ్రిపై దాడి చేసి గాయపరిచాడు. బాధతుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.


గురువులతో పూర్వ విద్యార్థుల బృందం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో 2003–04 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించుకున్నారు. 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు 40 మందికి పైగా ఒక్క చోట చేరి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక ఉన్నత చదువులకు వెళ్లి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో స్థిరపడ్డారు. అందరూ ఒక్క చోట చేరగానే ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదువుకునే సమయంలో గడిపిన ఆనంద క్షణాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా రూ.20 వేలను హెచ్ఎం బాలసుబ్బారెడ్డికి అందజేశారు.